క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాచర్ల: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు మాచర్ల టౌన్ అసిస్టెంట్ ఇంజినీర్ కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. పట్టణంలోని వినాయకునిగుట్ట, ఆజాద్‌నగర్, జయంతినగర్, మున్సిపాలిటీ పంప్ హౌస్ తదితర ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దుర్గి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు శ్రీశైలం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు రాజ గోపుర కలశ ప్రతిష్టా మహోత్సం

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాజగోపుర కలశ ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు జి.వేంకటేశ్వర శర్మ మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి 6వ తేదీ వరకు ఆలయంలో పలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రవచన రత్న బ్రహ్మశ్రీ మల్లాది వెంకటరామనాథ శర్మ, సుబ్రహ్మణ్య వైభవ ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే వార్షికోత్సవాన్న పురస్కరించుకొని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కల్యాణం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కొత్త పాలువాయి(రెంటచింతల): స్థానిక అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో వేకువ జాము నుంచే స్వామివార్లకు ప్రత్యేక పూజలు, వివిధ రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు.

గోవులు కబేళాకు తరలిస్తే చర్యలు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని క్రోసూరు మార్కెట్‌యార్డులో ప్రతి మంగళవారం గురువారం నిర్వహించే సంతలో కబేళాకు తరలించే గోవుల క్రయవిక్రయాలు నిషేధమని రైతులు తెలుసుకోవాలని యార్డు కార్యదర్శి ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ సంతలో కేవలం గేదెలు, కోడెదూడలు, ఎద్దులు, ఆవులు రైతుల వ్యవసాయం నిమిత్తం, పాడి కోసం మాత్రమే క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు. కావున రైతులు ఎవరైనా కబేళాకు తరలించే ఆవులను యార్డులో క్రయవిక్రయాలు జరిపితే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్‌యార్డు ఆవరణలో దీనిపై ఫ్లెక్సీలు, గోడలపై పెయింట్ ద్వారా, మైకు ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా కబేళాకు తరలించేందుకు సంతలో, సంత బయట ఆవుల విక్రయాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలతోపాటు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

నరసరావుపేట: సామాజిక భద్రతను మెరుగుపర్చేందుకు, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మున్సిపల్‌ఆఫీస్ రోడ్డు పరిసరాలలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ అధికారులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. చట్టవిరుద్ధ చర్యలు, అనుచిత కార్యకలాపాలను నిరోధించటం, ట్రాఫిక్ నియమాలను సమర్థవంతంగా అమలు చేయటం, ప్రజలకు భద్రతా భావన కలిగించటం, వాహనాల పత్రాలు, హెల్మెట్, నంబరు ప్లేట్, మద్యం సేవించి వాహనం నడుపుతున్నది.. వంటి అంశాలపై తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు బృందాలు నియమించబడి నిరంతరంగా పర్యవేక్షించారు. తనిఖీల సమయంలో ప్రజలు సహకరిస్తూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహన సంబంధిత పత్రాలు వెంట తీసుకెళ్లాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ఎం.విజయచరణ్ కోరారు. ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే అవకాశం కలిగి ఉండటంతో పాటు నేరాల నివారణకు దోహదపడతాయని అన్నారు. ఎస్‌ఐ అరుణ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో జగదీష్‌కు పతకాలు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ సీనియర్ రాష్ట్రస్థాయి ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్– 2025 స్విమ్మింగ్ పోటీల్లో శ్రీసుబ్బారాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ బంగారు పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన పోటీల్లో జగదీష్ 200 మీటర్లు ఫ్రీస్టైల్, బటర్ ఫ్లై విభాగాల్లో బంగారు, 100 మీటర్లు ఫ్రీస్టైల్‌లో రజితం, బటర్ ఫ్లై విభాగంలో కాంస్య పతకాలు సాధించినట్టు వివరించారు. పతకాలు సాధించిన జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయిని అభినందించారు.

ఉపాధి వేతనాల కోసం ఎదురుచూపులు

- తొమ్మిది వారాలుగా చెల్లించని వైనం
- ఇబ్బందులు పడుతున్న కూలీలు



మండలంలోని కొప్పునూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు

మాచర్ల రూరల్: గ్రామీణ పేదలకు ఉపాధి కష్టాలు తప్పడం లేదు. పాలకుల నిర్లక్ష్యంతో ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. రెండు నెలలు బకాయిలు ఉన్నాయి. ఆకలి కేకలు తప్పటం లేదు. జాతీయ ఉపాధి హామీ గ్రామీణ పథకం ద్వారా వలసలను నివారించి ఉన్న ఊరిలోనే పని కల్పించాలనే ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజు రూ.280 నుంచి రూ.300 వేతనం పొంది కుటుంబాన్ని పోషించుకునేందుకు ఉపయోగపడేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధి కూలీల గురించి పట్టించుకోవటం లేదు. గత రెండు నెలల నుంచి ఉపాధి కూలీలకు వేతనం అందించటం లేదు. నియోజకవర్గంలో కూలీలు ఆర్థిక ఇబ్బందులలో సతమతమవుతున్నారు. మాచర్ల మండలంలో 6500, దుర్గి 4500, కారంపూడి 5600, రెంటచింతల 5500, వెల్దుర్తి 8వేలు కలసి సుమారు 30 వేల మంది కూలీలకు రూ.90 లక్షలకు పైగా నగదు చెల్లించాల్సి ఉంది. వ్యవసాయంలో యాంత్రీకరణ మిషన్లు వచ్చిన తరువాత కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది కూలీలు జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పైనే జీవిస్తున్నారు. 60 రోజుల నుంచి ఒక్క రూపాయి కూడా వారి ఖాతాలలో జమ కాకపోవటంతో కూలీ పనులకు వెళ్ళినా కుటుంబాలు ఖర్చులకు డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నారు. మెటీరియల్ కాంపాండ్ బకాయిలు విడుదల చేయకపోవటంతో కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. రోజంతా కష్టపడితే సగటున రూ.250 నుంచి రూ.300 వస్తుంది. ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి. ప్రతి వారీ డబ్బులు అందిస్తే ఇంట్లో అవసరాలు, నిత్యవసరాలు కొనుగోలు చేస్తుంటారు. ఏప్రిల్ నెల నుంచి ఎర్రటి ఎండలో చెమటలు చిందించి పనులు చేసినా సుమారు 9 వారాలు దాటుతున్నా ఒక్క రూపాయి కూడా అందించకపోవటంతో కూలీలు పస్తులు ఉంటున్నారు.

అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ సంధ్యారాణి

గురజాల: అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాధికారిణి ఎం.సంధ్యారాణి హెచ్చరించారు. నగర పంచాయతీ పరిధిలోని పలు విత్తనాల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే విత్తనాలను రైతులకు అందించాలని కోరారు. విత్తనాల కంపెనీకి సంబంధిచి సోర్స్ ఆఫ్ సర్టిఫికేట్ లేకుండా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేయు సమయంలో ఏ కంపెనీకి చెందిన విత్తనాలు రకం పేరు, లాట్ నంబరుతో సహా బిల్లు రశీదుపై రాయించుకోవాలని సూచించారు.



తనిఖీలు చేస్తున్న ఏడీఏ కృష్ణదేవరాయలు

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు విత్తనాల షాపులు, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. వచ్చిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలు ఎప్పటికప్పుడు మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలని సూచించారు. రైతులకు అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు మరియు విత్తనాలు విక్రయిసేత చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఏడీఏ బి.శ్రీకష్ణదేవరాయలు, ఏఓ ఎస్.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



క్రోసూరు: మండలంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు, అభ్యసనాలు నిర్వహించారు. మంగళవారం విద్యార్థులకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎం.అంజనీ హేమలత, ఎం.నందిని, డి.రూప ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు విజ్ఞాన శిబిరాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

కిశోర బాలికలు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

సీడీపీఓ సరళ



పెదకూరపాడులో కిశోర బాలికలకు యోగాపై శిక్షణ ఇస్తున్న సిబ్బంది

పెదకూరపాడు: కిశోర బాలికలు చిన్నతనం నుంచి నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలని 75 త్యాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సరళ అన్నారు. పెదకూరపాడులోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ బాలికలు సాధికారత దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షేక్ మున్ని, మహిళా పోలీసులు ప్రవంతి శ్రీలక్ష్మీ, తిరుమల విమల, సిబ్బంది రాజ్యలక్ష్మి, జి.కుమారి, సీహెచ్ సామ్రాజ్యం, బి.వి.సామ్రాజ్యం, వెంకటలక్ష్మి, ప్రవంతి, కరిమున్, గౌసియా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు అంగన్‌వాడీ కేంద్రం–1లో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ అనంతలక్ష్మి కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలల హక్కులు, పోక్సో చట్టంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కౌమార బాలికల నాయకత్వం, సాధికారత గురించి వివరించారు. బాల్య వివాహాలు వద్దంటూ ప్రతిజ్ఞ, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త రోజ్‌మేరి, చాముండేశ్వరి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి జయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే మండలంలోని మాదల అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొని కిశోర బాలికల నాయకత్వం, సాధికారత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలను నివారిద్దాం.. మలేరియాను అరికడదాం



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్స్, పంచాయతీ సిబ్బంది

అచ్చంపేట: మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను నివారించుకోవాలని అచ్చంపేట సర్పంచ్ షేక్ జానీ తెలిపారు. మలేరియా నివారణ మసోత్సవాలలో భాగంగా ఆశావర్కర్స్ ఆధ్వర్యంలో అచ్చంపేటలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాని మాట్లాడుతూ మలేరియా సాధారణంగా దోమకాటు వలన వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలను నివారించేందుకు పంచాయతీల ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్ల ముందు మురుగు శుభ్రపరచుకోవడం, మురుగు కాలువల్లో తరచూ బ్లీచింగ్ చల్లుకోవడం, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరాల రమేష్, అనుముల సాంబిరెడ్డి, ఆశా వర్కర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాజుపాలెం: వర్షాలు పడుతున్న సందర్భంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పల్నాడు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి చెప్పారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలుంటే తొలగించాలన్నారు. మురికి నీటి నిల్వపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తే మలేరియా రాకుండా చేయవచ్చని తెలిపారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పాల్‌రవి, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఆశ నోడల్ అధికారి సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఘనంగా గంగమ్మ తల్లి జాతర



శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి జాతర వేడుకలు గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అందరు గంగమ్మ తల్లిని దర్శించుకొని జలాభిషేకం చేసి పసుపు-కుంకుమలతో మేళతాళాల నడుమ వైభవంగా బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవం కార్యక్రమంలో పార్టీల కులమతాలకు అతీతంగా భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్నారు. భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

భూగర్భ జలాల పెంపునకే సేద్యపు నీటి కుంటలు

- రైతులకు ఎంతో ప్రయోజనం
- ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం



అందుకూరు గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న సేద్యపు నీటి కుంట

క్రోసూరు: పొలాలకు నీళ్లు పుష్కలంగా అందించి పంటలు దిగుబడి బాగా పొందేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సేద్యపు నీటి కుంటల నిర్మాణాలకు చేయూతనిస్తుంది. మండలంలో ఈ ఏడాది సేద్యపు నీటి కుంటల నిర్మాణాలే లక్ష్యంగా పనిచేయాలంటూ డ్వామా పీడీ సిద్ధమూర్తి ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నప్పటికీ రైతులు పూర్తి స్థాయిలో ముందడుగు వేయటం లేదని చెప్పాలి.

- వర్షాలు పడినపుడు పొలంలో నీరు పారే దిశగా సుమారు 10 సెంట్ల స్థలంలో సేద్యపు నీటి కుంట ఏర్పాటు చేసుకునేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల చేత నిర్మాణం చేసి అందిస్తుంది. అందుకు కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా వేతనాలు చెల్లించటం జరుగుతుంది. కేవలం రైతు అంగీకరం తెలిపి తనకు కావాలిసిన సైజు సూచిస్తే ప్రభుత్వమే సేద్యపు నీటి కుంట తయారు చేసి ఇస్తుంది.

కొలతలు.. ఖర్చు ఇలా...

రైతు సేద్యపు నీటి కుంట ఏర్పాటుకు 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు, లోతు 2 మీటర్లలో నిర్మాణం చేసుకుంటే రూ.30,281 కూలీల వేతనాలకు ఖర్చు చేస్తుంది. అదే విధంగా 10, 10, 2 కొలతలకు రూ.70,521, కొలతలు 15, 15, 2 ప్రకారం రూ.1,32,190, 20, 20, 2 ప్రకారమైతే రూ.2,14,358 ఖర్చు చేస్తుంది.

150 గాను 30 మాత్రమే పూర్తి

మండలంలో ఈ ఏడాది మొత్తం లక్ష్యం 150 సేద్యపు నీటి కుంటలకు గాను ఇప్పటికి 30 మాత్రమే పూర్తి చేసినట్లు ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. మరో 57 వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. సేద్యపు నీటి కుంటలు నిర్మించుకోవటం వలన భూగర్భ జలాలు పెరగటమేకాక, పొలాల గట్లపై మొక్కలు, పొలాల్లో పశువులకు మేత, పండ్ల మొక్కలు, పెంచుకోవచ్చని, అదే విధంగా గట్లపై కూరగాయలు కూడా పెంచుకోవచ్చునని ఏపీవో తెలియజేశారు.

నీటి కుంటలు నిర్మించుకోవాలి



ప్రతి రైతు తమ పొలాల్లో సేద్యపు నీటి కుంటలు నిర్మించుకోవాలి. తద్వారా రైతుకు అన్ని విధాలుగా సేద్యపు నీటి కుంటలు ఉపయోగపడతాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతుకు కాలసిన విధంగా ప్రభుత్వం నిర్మాణాలు చేసి ఇస్తుంది.

– జి.రవికుమార్, ఎంపీడీవో

క్షయ రహిత సమాజమే లక్ష్యం



శావల్యాపురం: క్షయ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్తా భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమ్య మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు జ్వరం ఆకలి మందగించటం తదితర లక్షణాలతో బాధపడే వారందరూ సత్వరమే వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యసేవలు అందించటం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పుతుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు మెమోరియల్ పల్నాడు జిల్లా స్థాయి టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. మొదటి బహుమతిని డాక్టర్ లెవెన్ ఉజ్జయనీ రెడ్డిపాలెం జట్టు గెలుచుకోగా, రెండవ బహుమతిని కొత్తపల్లి జట్టు, మూడవ బహుమతిని కె.పి. కింగ్ స్టార్స్ జట్లు గెలుచుకున్నాయి. మొదటి బహుమతిగా రూ.20,116లు రెండవ బహుమతిగా రూ.15, 116లు, మూడవ బహుమతిగా రూ.10,116 లను అందజేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులను గంగూరి రాధాకృష్ణ, శ్రీ కృష్ణ చైతన్య విద్యాసంస్థలు, నందిగం అచ్చయ్యలు సమకూర్చగా, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ బహుమతులను ఉస్తేల ప్రేమ్‌కుమార్, పావులూరి ఎంటర్‌ప్రైజెస్ వారు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యామర్తి రామారావు, కొలికొండ వెంకట్రావు, గంగూరి కోటేశ్వరరావు, కోమటినేని వెంకటేశ్వర్లు, పావులూరి వినిల్, యు.బుల్లి అబ్బాయి, టోర్నమెంట్ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కృషి



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

దాచేపల్లి: గ్రామీణా ప్రాంతాల్లోని క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని డాక్టర్ నారదాసు రవిచంద్ర అన్నారు. డాక్టర్ నారదాసు నాగేశ్వరరావు మెమొరియల్ ఇండోర్ స్టేడియంలో సోమవారం రాత్రి మీసాల రామయ్య జ్ఞాపకార్థం మండల స్థాయి షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి లంకె వాసుదేవరావు– చెట్టిపోగు రాములు, రెండో బహుమతిని నారదాసు రవిచంద్ర– ఇరగదండ్ల రామసైదులు, మూడో బహుమతి మీసాల విజయబాబు– మంజులా మురళి సాధించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులు తమ ప్రతిభను గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఆటల ద్వారా వెలికితీయవచ్చన్నారు. పల్నాడు ప్రాంతంలో ఉన్న క్రీడా ఆణిముత్యాలకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. పోటీల్లో నిర్వాహకులు మీసాల విజయకుమార్, కమిటీ సభ్యులు కర్నాటి నాగేశ్వరరావు, వినుకొండ అజయ్‌కుమార్, వినుకొండ సునీల్ కుమార్, వినుకొండ వజ్రం పాల్గొన్నారు.

దైవ సేవకులు ఐకమత్యంగా ఉండాలి



సదస్సుకు హాజరైన పాస్టర్లు

రెంటచింతల: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో దైవ సేవకులుగా సువార్త బోధిస్తున్న వారందరూ ఐక్యమత్యంగా ఉన్నప్పుడే వారి సమస్యలు పరిష్కారమవుతాయని మండల పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ గౌరవ అధ్యక్షులు రె.పాస్టర్ డాకూరి ప్రభుదాస్ అన్నారు. మంగళవారం స్థానిక హెర్మోను ప్రార్థన మందిరంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి పాస్టర్లు అందరూ కలిసి కృషి చేయాలన్నారు. అనంతరం పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సదస్సులో మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యల ఆంథోని, కార్యదర్శి రె.కొమ్ము మోషే, కమిటీ సభ్యులు పల్బారి ఏసోబు, డాకూరి డేవిడ్, మీసాల జాన్ పీటర్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పిడుగురాళ్ల: ఎయిడ్స్‌పై కళాజాతా బృందం మంగళవారం అవగాహన కల్పించింది. ప్రభ కల్చరల్ ఆర్గనైజేషన్, కళాజాతా బృందంతో పిడుగురాళ్లలోని సున్నపు బట్టీల ప్రాంతంలో జానపద కళాకారులతో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్షత, చిన్న చూపు లేకుండా సమాజంలో ఏ విధంగా కలిసి జీవించాలో అన్న అంశంపై చక్కగా వివరించారు. హెచ్ఐవీకి, క్షయ వ్యాధి సంబంధం గురించి, హెచ్ఐవీ ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అదేవిధంగా హెచ్ఐవీ పరీక్షలు అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా నిర్వహిస్తారు. వ్యాధి ఉన్నవారు ఏఆర్ టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల ఐసీటీసీ కౌన్సిలర్ సిహెచ్.నాగరాజు, ఎల్‌టీ రాజ్యలక్ష్మి, రీడ్స్ టీఐ సిబ్బంది, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎండీ గౌస్, ప్రాజెక్ట్ మేనేజర్ కోమలి, ఓఆర్‌డబ్ల్యూ ఎం. శేషయ్య, పీఆర్ ఎడ్యుకేటర్ మబులా, హనుమంతరావు, కళాజాతా బృందం సభ్యులు వీర్నాల మల్లికార్జున రావు, వెంకటలక్ష్మి, మిర్యాల మలయ్య, కనకరావు, ప్రభావతి, శాంతి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఏజెన్సీల సభ్యులు

పెదకూరపాడు: పెదకూరపాడు విద్యా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డొక్కా సీతమ్మ– మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం మండల విద్యా శాఖాధికారి తాడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనీ రమాదేవి పాల్గొని ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ఆరోగ్యం కోసం-బలవర్ధకమైన ఆహారం వి ద్యార్థులకు అందించనుందని తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే నిర్వాహకులు శుభ్రంగా, వేడిగా విద్యార్థులకు భోజనం అందించాలని అన్నారు. వంటశాల దగ్గర శుభ్రంగా ఉండాలని, గుడ్లు మంచి వాటిని వాడాలని కోరా రు. మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ నిబంధనల మేరకు తగు జాగ్రత్తలతో శుభ్రంగా, విద్యార్థులకు ఎండీఎం అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సీహెచ్‌వో అనుపమ మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలు అధికంగా ఉండే, ఇమ్యూనిటీ పెంచే ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఆయాలు పాల్గొన్నారు.